'నవోదయ' ఫలితాలు విడుదల

చొప్పదండి, ఏప్రిల్ 1: చొప్పదండిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొవిషనల్ సెలెక్ట్ లిస్టులో అర్హులైన 80 మంది విద్యార్థుల రూల్ నంబర్లను ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఆధార్ కార్డు, హాల్ టికెట్, దరఖాస్తు చేసిన సమయంలో అప్‌లోడ్ చేసిన హెచ్‌ఎం సర్టిఫికెట్స్ ఒరిజినల్స్ తీసుకొని ఈనెల 5లోగా విద్యాలయం కార్యాలయంలో అడ్మిషన్ పొందాలని సూచించారు.

నేడు సర్వాయి పాపన్న వర్ధంతి

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 1: నగరంలోని 8వ డివిజన్ (అల్గునూర్)లో వంతెనపై ఉన్న సర్వాయి పాపన్న విగ్రహం వద్ద మంగళవారం వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు కలర్ సత్తయ్యగౌడ్ తెలిపారు. కరీంనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వాయి పాపన్న వర్ధంతి కార్యక్రమానికి బహుజనులు, గౌడ కుల బాంధవులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం నాయకులు కోడూరి పరశురాం గౌడ్, పిల్లి మహేశ్‌గౌడ్, గౌడిసెల రమేశ్‌గౌడ్, సతీశ్ గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

సైదాపూర్, ఏప్రిల్ 1: మండలంలోని ఆకునూర్ ఎంపీపీఎస్‌కు చెందిన ఐదో తరగతి విద్యార్థి ఈదులకంటి వినూత్‌రెడ్డి ఇటీవల ప్రకటించిన నవోదయ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో సత్తా చాటి ఆరో తరగతి చదివేందుకు అర్హత సాధించారు. వినూత్‌రెడ్డిని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

16 మంది బైండోవర్

శంకరపట్నం, ఏప్రిల్ 1: మండలంలోని కొత్తగట్టు, కాచాపూర్, గద్దపాక, ధర్మారం గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న 16 మందిని బైండోవర్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సుధాకర్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ ఎదుట హాజరుపరిచినట్లు వెల్లడించారు.

నేడు డయల్ యువర్ డీఎం

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 1: హుజూరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ సామల శ్రీకాంత్ సోమవారం తెలిపారు. సమస్యల విన్నపం, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రజలు, ప్రయాణికులు సెల్ నంబర్ 9959225924కు మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ఫోన్ చేయాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, GURUDEEP SINGH, R/o. 8-2-86/4, Hariharanagar, Kattarampur, Karimnagar, TS. Changed My Name as SARDAR GURUDEEP SINGH, S/o. Sardar Nirmal Singh.

NT-311780

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

చొప్పదండి మండలం వెదురుగట్టలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, ఆయా శాఖల అధికారులు

- లాంఛనంగా ప్రారంభించిన కలెక్టర్ పమేలా సత్పతి
- వారం తర్వాతే ముమ్మరంగా వరి కోతలు
- జిల్లాలో 3.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- 341 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న అధికారులు

కరీంనగర్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): యాసంగిలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.చొప్పదండి మండలం వెదురుగట్టలో సోమవారం కలెక్టర్ పమేలా సత్పతి లాంఛనంగా ప్రారంభించారు. వారం తర్వాతనే కొనుగోళ్లు ముమ్మరం కానున్నాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 3.64 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు 341 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో 20 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయితే నీళ్లు లేక పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో ఆశించిన దిగుబడి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

2.67 లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో యాసంగిలో 2.67 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. మంచి దిగుబడి వస్తే 6.35 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం వచ్చే అవకాశం ఉంటుంది. కానీ, సాగు నీరందక అనేక మండలాల్లో వేలాది ఎకరాల్లో వరి ఎండిపోయింది. గంగాధర, రామడుగు, చిగురుమామిడి, తిమ్మాపూర్, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, తదితర మండలాల్లో పెద్ద మొత్తంలో పంటలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఆశించిన దిగుబడి రాకపోవచ్చు. అయితే అధికారులు మాత్రం సాగైన విస్తీర్ణంపై వచ్చే దిగుబడిని అంచనా వేస్తున్నారు. వారి గణాంకాల ప్రకారం చూస్తే విత్తనోత్పత్తి, రైతులు కుటుంబ అవసరాలు అట్టిపెట్టుకునే ధాన్యం పోనూ 2.35 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, గత రెండు, మూడు సీజన్ల నుంచి ప్రైవేట్ వ్యాపారులు కూడా ధాన్యం పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. ఇతర జిల్లాల వ్యాపారులు కూడా ఇక్కడికి వచ్చి కొనుగోళ్లు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారుల అంచనాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందనే నమ్మకం కనిపించడం లేదు.

20 గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభం

జిల్లాలో ఇప్పుడిప్పుడే కోతలు ప్రారంభిస్తున్నారు. ముందుగా నాట్లు వేసిన రైతులు కోతలు నిర్వహించుకుంటున్నారు. వీరికి అందుబాటులో కేంద్రాలు ఉంచాలని భావిస్తున్న అధికారులు సోమవారం 20 గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించారు. చొప్పదండి మండలం వెదురుగట్టలో కలెక్టర్ పమేలా సత్పతితో పాటు ఇతర అధికారులు ప్రారంభించారు. ముందుగా కోతకు వచ్చే హుజూరాబాద్‌లో 5, జమ్మికుంటలో 2, చిగురుమామిడి, గంగాధర, గన్నేరువరం, ఇల్లందకుంట, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, మానకొండూర్, రామడుగు, శంకరపట్నం, తిమ్మాపూర్, సైదాపూర్, వీణవంక మండలాల్లో ఒక్కో కేంద్రాన్ని ప్రారంభించారు. మిగతా కేంద్రాలను డిమాండ్‌ను బట్టి ప్రారంభించనున్నారు. జిల్లాలో మొత్తం 341 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన అధికారులు ఐకేపీ ద్వారా 50, సహకార సంఘాల ద్వారా 238, డీసీఎంఎస్ ద్వారా 47, హాకా ద్వారా 6 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ. 2,203, సాధారణ రకానికి రూ. 2,183 చెల్లిస్తున్నట్లు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డీఎం రజినీకాంత్ తెలిపారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కర్షకులకు భరోసానిచ్చేందుకే కేసీఆర్ యాత్ర

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, పక్కన ప్రజాప్రతినిధులు, నాయకులు

- 6న హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన
- పార్టీ శ్రేణులు తరలిరావాలి
- బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 1: ఇటు సాగునీరందక, కరెంట్ లేక పంటలు ఎండిపోయి అరిగోస పడుతున్న కర్షకులకు భరోసానిచ్చేందుకే బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 5న కరీంనగర్‌లో పర్యటించనున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ తెలిపారు. హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకోవడం కేసీఆర్‌ను కలిచివేసిందన్నారు. ఈ నేపథ్యంలోనే వారికి అండగా ఉండేందుకే ఆరోగ్యం సహకరించకున్నా జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలన్నారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని, వడ్లు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ కృషితోనే నియోజకవర్గ ప్రజలకు మేలు జరిగిందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆయనకు అండగా నిలిచి అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మార్పు పేరుతో ఓటర్లను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు రైతుల పాలిట శనిలా దాపురించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ఈనెల 6న హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నామన్నారు. కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పదవీ వ్యామోహంతో కన్నతల్లి లాంటి పార్టీని వీడి అధికార పార్టీలో చేరిన కేకే, కడియం శ్రీహరికి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సంగెం ఐలయ్య, కౌన్సిలర్లు కల్లెపల్లి రమాదేవి, కేసిరెడ్డి లావణ్య, ముక్క రమేశ్, మెరుగు కొండల్‌రెడ్డి, సీనియర్ నేత ఇరుమల్ల సురేందర్‌రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జి తులసీ లక్ష్మణమూర్తి, మాజీ సర్పంచ్ ఎం ఎల్లయ్య, ఎండీ రియాజ్, మోరే మధు, తొగరు శివకుమార్, బత్తుల సమ్మయ్య, బొంగాని శ్రీనివాస్‌గౌడ్, పోచంపల్లి సదయ్య, సమ్మిరెడ్డి, మొలుగు శ్రీనివాస్, భాస్కరాచారి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

వీణవంక: మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌ఐ రవి, తదితరులు

- గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలి
- కలెక్టర్ పమేలా సత్పతి
- వెదురుగట్టలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చొప్పదండి, ఏప్రిల్ 1: రైతులు పండించిన వడ్లకు మద్దతు ధర ఇచ్చేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రైతులు నిర్ణీత ప్రమాణాల మేరకు సెంటర్లకు ధాన్యం తీసుకురావాలని సూచించారు. చొప్పదండి మండలం వెదురుగట్టలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచుల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డీఏవో శ్రీనివాస్, డీసీఎస్వో గౌరీ శంకర్, సివిల్ సప్లయ్ డీఎం రజనీకాంత్, అదనపు డీఆర్డీవో సునీత, డీపీఎం ప్రవీణ్, ఏపీఎం నర్మద, ఏవో వంశీ, సివిల్ సప్లయ్స్ డీటీలు ఉషా, కమలేశ్ ఉన్నారు.

హుజూరాబాద్ రూరల్(జమ్మికుంట)ఏప్రిల్ 1: జమ్మికుంట పీఏసీఎస్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ కార్యదర్శి గుగులోతు రెడ్యానాయక్, పీఏసీఎస్ సీఈవో రవీందర్ ప్రారంభించారు. ఇక్కడ సింగిల్ విండో, మార్కెట్ కార్యాలయ సిబ్బంది ఆరుపతి, దేవేందర్ రెడ్డి, అనిల్, శ్రీనివాస్, బాబా, సంపత్, శ్రీనాథ్ ఉన్నారు.

శంకరపట్నం, ఏప్రిల్ 1: మండలంలోని కొత్తగట్టులో మెట్‌పల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం సెంటర్‌ను విండో సీఈవో సదయ్య, సెంటర్ ఇంచార్జి రాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రభుత్వం ఏ-గ్రేడ్ రకానికి రూ.2203, బీ-గ్రేడ్ రకానికి రూ.2183 మద్దతు ధర ఇస్తున్నదని తెలిపారు.

ఇల్లందకుంట, ఏప్రిల్ 1: ఇల్లందకుంట పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని సీతంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈవో ఆదిత్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరపల్లి, మడిపల్లి, అంకుశపూర్, కనగర్తి, శ్రీరాములపల్లి, బూజునూరు, రాచపల్లి, గడ్డివానిపల్లి, టేకుర్తి, నాగారం, నగురం, వావిలాల, విలాసాగర్, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లో త్వరలోనే కేంద్రాలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

చిగురుమామిడి, ఏప్రిల్ 1: సెర్ప్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం సెంటర్‌ను ఏపీఎం మట్టెల సంపత్, ఆర్‌ఐ శైలజతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీలు సత్యనారాయణ, వెంకటమల్లు, వీవో చైర్‌పర్సన్ పోలోజు చైతన్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైదాపూర్, ఏప్రిల్ 1: సైదాపూర్ మండలం రాయికల్ తండా లో టీ-సెర్ప్ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం చెన్నబోయిన కుమారస్వామి ప్రారంభించారు. ఇక్కడ సీసీ జమున, పంచాయతీ కార్యదర్శి విష్ణు, వీఓ అధ్యక్షురాలు అమిత, వీవోఏ నిర్మల ఉన్నారు.

వీణవంక, ఏప్రిల్ 1: మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆర్‌ఐ రవి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈవో స్రవంతి, ఐకేపీ సీసీలు శ్రీకాంత్, తిరుపతి, కమిటీ సభ్యులు దాసారపు సరోజన, పిట్టల రోజారాణి, పులాల రాధ, రజిత, హమాలీ కార్మికులు, రైతులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 1: కరీంనగర్ రూరల్ మండలం బహద్దుర్‌ఖాన్‌పేటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ సీసీ వనితారాణి ప్రారంభించారు. మహిళా సంఘం అధ్యక్షురాలు నిర్మల, సీఏ గంగా జమున, హమాలీలు పాల్గొన్నారు.

ఎండిన పంటలను పరిశీలించిన బీఆర్‌ఎస్ నాయకులు

ఎండిన వరిని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 1: కరీంనగర్ రూరల్ మండలంలో ఎండిన పంటలను పరిశీలించేందుకు ఈనెల 5న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. ఈ క్రమంలో మండలంలోని ఇరుకుల్ల, ఎలబోతారం, దుర్శేడ్, గోపాల్‌పూర్, మొగ్దుంపూర్ గ్రామాల్లో ఎండిన పంటలను సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, కుక్కట్ల తిరుపతియాదవ్, దామరపల్లి అంజిరెడ్డి, దాడి లక్ష్మణ్ పరిశీలించారు. కాగా, మొగ్దుంపూర్‌లోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఎండిన పంటలను పరిశీలించేందుకు ఏర్పాట్లు చేయడానికి అనుకూలంగా ఉందని వారు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు తెలిపారు.

ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవోలు, ఏపీవోలు ఎన్నికల సంఘం నిబంధనలు విధిగా పాటించాలని ఏఆర్వో మహేశ్వర్ సూచించారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం కరీంనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ స్థాయి పీవోలు, ఏపీవోలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఆర్వో మాట్లాడుతూ, ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పని చేయాలని సూచించారు. పోలింగ్‌కు ముందు రోజు, ముగిసిన తర్వాత ఈవీఎంలు, సామగ్రిని జాగ్రత్తగా తీసుకెళ్లాలని పేర్కొన్నారు. పోలింగ్ రోజు తెల్లవారుజామున మొదట మాక్ పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు, సందేహాలు వస్తే ఉన్నతాధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను జాగ్రత్తగా చూసుకొని మూసివేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ విషయంలో ఉద్యోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూస్తామని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా సిబ్బంది సహకరించాలన్నారు. పీవోలు, ఏపీవోల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ రూరల్, అర్బన్, కొత్తపల్లి తహసీల్దార్లు, కలెక్టరేట్ ఏవో సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే పోటీలు

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

రామడుగు, (చొప్పదండి), ఏప్రిల్ 1: రామడుగు మండలం గోపాల్‌రావుపేటలోని అల్ఫోర్స్ పాఠశాలలో ఒకినొవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, కరాటే డిప్యూటీ గ్రాండ్ మాస్టర్, చీఫ్ ఎగ్జామినర్ వసంత్‌కుమార్ హాజరై విజేతలకు కరాటే బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరంలో కేంద్ర బలగాల కవాతు

రాంనగర్, ఏప్రిల్ 1: నగరంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాల్లో సీఐఎస్‌ఎఫ్ బలగాలతో సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గాంధీచౌరస్తా వద్ద ప్రారంభమైన ఫ్లాగ్ మార్చ్ కిసాన్ నగర్, ప్రవిష్ట రోడ్ మీదుగా కార్ఖానాగడ్డ, నాకా చౌరస్తా, తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సీఐఎస్‌ఎఫ్ సేవలు వినియోగించనున్నట్లు సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, కంపెనీ కమాండెంట్ విక్రాంత్, అసిస్టెంట్ కమాండెంట్ విజేందర్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ జాన్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద యువతి పెండ్లికి 'చేయూత'

హుజూరాబాద్ రూరల్(జమ్మికుంట) ఏప్రిల్1: జమ్మికుంట పట్టణానికి చెందిన నిరుపేద యువతి వివాహానికి చేయూత ఫౌండేషన్ అండగా నిలిచింది. అభేద బాను-శిరీష దంపతులు తమ బిడ్డకు సాయం చేయాలని ఫౌండేషన్ అధ్యక్షుడు దూడపాక శ్రీనివాస్‌ను కోరారు. స్పందించిన ఆయన పుస్తెమట్టెలు, పెండ్లి చీర, రూ. 5 వేల నగదు అందజేశారు.

స్వాతంత్య్ర సమరయోధుడి మృతికి సంతాపం

కార్పొరేషన్, ఏప్రిల్ 1: స్వాతంత్య్ర సమరయోధుడు గన్నేరువరం మండలానికి చెందిన జువ్వాడి మధుసూదన్‌రావు మృతి పట్ల మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సంతాపం తెలిపారు. స్థానిక ముకరంపురలోని నివాసంలో సోమవారం ఆయన మధుసూదన్‌రావు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, మధుసూదన్‌రావు ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థి ఉద్యమ నాయకుడిగా పని చేశారని, గాంధీ పిలుపు మేరకు మల్టీపర్పస్ స్కూల్‌లో జాతీయ జెండాను ఎగురవేశారని గుర్తు చేశారు.

రైతులను ఆదుకోవాలి

హుజూరాబాద్ టౌన్/మానకొండూర్ రూరల్/ శంకరపట్నం/ చిగురుమామిడి/ కొత్తపల్లి/గంగాధర, ఏప్రిల్ 1: ఇటు సాగునీరందక, అటు అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ నాయకులు సోమవారం హుజూరాబాద్ తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఎండిన పంటలు ఎకరాకు రూ. 25 వేల పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పారిపెల్లి కొండాల్‌రెడ్డి, వొడ్నాల విజయ్, రావుల భాస్కర్‌రెడ్డి, తుర్పాటి రాజు, రావుల వేణు తదితరులున్నారు. అలాగే, మానకొండూర్ తహసీల్ కార్యాలయంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాపాక ప్రవీణ్ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ బీజేపీ నాయకులు ఎడబోయిన రామకృష్ణారెడ్డి, మియాపురం లక్ష్మణాచారి, కత్తి ప్రభాకర్ గౌడ్, కంది రాజిరెడ్డి, సొన్నాకుల శ్రీనివాస్ ఉన్నారు. శంకరపట్నం తహసీల్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌కు బీజేపీ మండలాధ్యక్షుడు అనిల్, నాయకులు అశోక్, సాగర్, సంపత్, దొంగల రాములు, శివారెడ్డి, చిగురుమామిడి తహసీల్ ఆఫీసులో పార్టీ మండలాధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో నాయకులు కంది శంకర్, పిండోట రఘు, కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వినతిపత్రం అందించారు. కొత్తపల్లి తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ రాజేశ్‌కు బీజేపీ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. నాయకులు కడార్ల రతన్‌కుమార్, కెంచ శేఖర్, వేముల అనిల్, అంజన్ కుమార్, కొప్పుల హరిప్రసాద్, ఎర్రోళ్ల ప్రదీప్, స్వర్గం నర్సయ్య, వేముల చంద్రశేఖర్, గోపు మునీందర్, సమ్మిరెడ్డి, హరిబాబు, శ్రావణ్, మందల సేనారెడ్డి, నార్ల రాజు, చిట్కూరి శ్రీనివాస్, రాచకొండ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. గంగాధర తహసీల్ కార్యాలయంలో సిబ్బందికి బీజేపీ నాయకులు శ్రవన్, అశోక్, నారాయణ, శ్రీనివాస్, వినయ్‌సాగర్, నవీందర్‌రెడ్డి, శ్రీపతి చంద్రశేఖర్, దేశెట్టి శ్రీనివాస్, తాళ్ల శేఖర్, దయ్యాల ప్రణయ్ వినతిపత్రం ఇచ్చారు.

హుజూరాబాద్‌టౌన్: తహసీల్ కార్యాలయ ఉద్యోగికి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కంప్యూటర్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

- కిట్స్ డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 1: విద్యార్థులు కంప్యూటర్, ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ) స్కిల్స్ పెంపొందించుకోవాలని సింగాపూర్ కిట్స్ డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ ఉద్బోధించారు. కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో 'డీ వోప్స్ ఏ జర్నీ ఫ్రం నో వాయిస్ టూ ప్రొఫెషనల్' అనే అంశంపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీలోని మార్పులను అవగతం చేసుకోవాలని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఈశ్వరయ్య మాట్లాడుతూ విద్యార్థులకు అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కే రవీంద్రబాబు, ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ కే ప్రవీణ్ కుమార్‌రావు, ప్రోగ్రాం సమన్వయకర్త డీ ప్రశాంత్‌కుమార్, ల్యాబ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 1: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మ్యాజిక్ బస్ ఇండియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. వారం పాటు వివిధ అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. సంస్థ హెచ్‌ఆర్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పవిత్ర, ట్రైనర్ తిరుపతి, జిల్లా మొబిలైజేషన్ ఇన్‌చార్జి శివ హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సమత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుష్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

7న మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష

తిమ్మాపూర్, ఏప్రిల్1: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో 6వ తరగతితో పాటు 7-10 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7 నుంచి పదో తరగతి వరకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని వెల్లడించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

విద్యార్థి మృతి మిస్టరీని ఛేదించాలి

తిమ్మాపూర్, ఏప్రిల్1: మండలంలోని ఓ కళాశాలకు చెందిన విద్యార్థి ఇటీవల బావిలో శవమై కనిపించగా, అతని మరణం ఇప్పటికీ మిస్టరీగానే మిగిలింది. దీంతో కుటుంబ సభ్యులు రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును కలువగా ఆయన సోమవారం సాయంత్రం తిమ్మాపూర్‌లో ఆగి కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థి మరణం మిస్టరీని త్వరగా ఛేదించాలని సూచించారు. హత్యానా, ఆత్మహత్యానా తేల్చాలన్నారు. అనంతరం స్థానికులతో కొద్దిసేపు మాట్లాడి హైదరాబాద్‌కు పయనమయ్యారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఏప్రిల్ 1: కరీంనగర్ శివారులోని 11కేవీ వల్లంపహాడ్ ఫీడర్‌లో 11కేవీ లైన్ షిఫ్టింగ్ పనులు చేపడుతున్నందున మంగళవారం రాణిపూర్ రోడ్డులో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ కే రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ మెహర్‌నగర్ ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున మెహర్‌నగర్, ఎన్‌సీసీ ఆఫీసు వెనక ప్రాంతం, సీతారాంపూర్‌లో కొంత ప్రాంతానికి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-1 ఏడీఈ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు బీజేపీ 'రైతు దీక్ష'

విద్యానగర్, ఏప్రిల్ 1 : రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 2న కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయం వద్ద రైతు దీక్ష నిర్వహిస్తున్నట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం నగరంలో మాట్లాడుతూ, రూ.2 లక్షల పంట రుణమాఫీ అమలు చేయాలని, ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు.

శిక్షణ శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్

గంగాధర, ఏప్రిల్ 1: మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్‌పై పీవో, ఏపీవోలకు సోమవారం శిక్షణ ఇచ్చారు. శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, తహసీల్దార్ రమేశ్‌బాబు, శిక్షణ అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాంనగర్, ఏప్రిల్ 1: నగరంలో కాంగ్రెస్ మైనారిటీ సెల్ నగర అధ్యక్షుడు సయ్యద్ అఖిల్ ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబ సభ్యులను సోమవారం మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పరామర్శించారు. ఆయన వెంట రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్, తదితరులున్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్

గంగాధర, ఏప్రిల్ 1: చదువుకుంటేనే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విద్యార్థులకు సూచించారు. గంగాధర వివేకానంద పాఠశాల విద్యార్థి అద్వైత్ నవోదయ విద్యాలయంలో, రిషేందర్, అభిషేక్, జశ్వంత్, సాహిత్ సైనిక్ స్కూల్లో సీట్లు సాధించారు. కాగా, సోమవారం గంగాధరలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విద్యార్థులను అభినందించారు. ఇక్కడ పాఠశాల కరస్పాండెంట్ పర్రెం లక్ష్మారెడ్డి, డైరెక్టర్ గుడి అనంతరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నర్సింగరావు తదితరులున్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం